ప్రజాశక్తి
ఆదివారం 6 నవంబర్ 2022
5
శ్రీ సత్యసాయి





తహశీల్దార్లతో మాట్లాడుతున్న కలెక్టర్ బసంత్‌కుమార్

రీ సర్వేలో నాణ్యతే ప్రామాణికం


కలెక్టర్ బసంత్‌కుమార్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

జిల్లాలో జరుగుతున్న భూ రీ సర్వే ప్రక్రియ నాణ్యతగా చేపట్టడమే అధికారులు ప్రామాణికంగా భావించాలని కలెక్టర్ పి.బసంత్‌కుమార్ తహశీల్దార్లకు సూచించారు. శనివారం స్థానిక కలెక్టరేట్లోని స్పందన హాలు నందు జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకంపై రెండవ రోజు సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ టిఎస్.చేతన్, డిఆర్‌ఒ కొండయ్య, ల్యాండ్ అండ్ సర్వే సహా సంచాలకులు రామకష్ణయ్యతో పాటు జిల్లాలోని తహశీల్దార్లు, సర్వే అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రీ సర్వే ప్రక్రియలో తప్పులు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. భూ వివాదాలు, తగాదాలు గ్రామాలు సాక్షాత్కారమే కావడమే రీసర్వే లక్ష్యమన్నారు. ఎక్కడా కూడా సర్వే అసంపూర్తిగా మిగిలిపోయింది అన్నమాట వినిపించకూడదన్నారు. మొబైల్, ట్రిబునల్, సరిహద్దులు, సబ్ డివిజన్లు ఇవన్నీ చాలా క్రమబద్ధతలో ముందుకు సాగాలన్నారు. సర్వే చేస్తున్నప్పుడు ఉత్పన్నమైన సమస్యలను అత్యంత ప్రణాళికాబద్ధంగా పరిష్కరించుకుంటూ ముందుకు వెళ్లాలన్నారు. రీ సర్వే అభ్యంతరాలపై విచారణ జరిపి స్పష్టమైన కారణాలు నివేదించాలన్నారు. గ్రామాల్లో రీ సర్వే టీములు ఏర్పాటు చేసి రీసెర్వే పనులు వేగవంతం చేయాలని తెలిపారు. చుక్కల భూములపై నిబంధనలు అనుసరించి అధికారులు నిర్ణయాలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పుట్టపర్తి ఆర్డీవో భాగ్యరేఖ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

కోర్టు నోటీసులతో..

కుట్ర 'పన్ను'తున్నారు..!




- ఇంటి పన్నులు చెల్లించాలని గ్రామీణులకూ కోర్టు నోటీసులు
- పంచాయతీలకు చేరిన బెదిరింపుల వ్యవహారం
- ముక్కుపిండి వసూళ్లు చేసేందుకు ప్రభుత్వం చర్యలు
- కోర్టు నోటీసులతో హడలెత్తుతున్న గ్రామీణ పేదలు

ప్రజల నుంచి ఇంటి, కొళాయి పన్నులను ముక్కుపిండి వసుళ్లు చేసేందుకు ప్రభుత్వం అన్ని అస్త్రాలను ఉపయోగిస్తోంది. ప్రజల ఇబ్బందులతో తమకేమి సంబంధం.. పన్నులు మాత్రం చెల్లించాల్సిందే అనేలా పేదలపై ఒత్తిడి పెంచుతున్నారు. ఇంత వరకు మున్సిపాల్టీల్లో మాత్రమే కన్పించే బలవంతపు పన్నుల వసూళ్లు ఇప్పుడు గ్రామాలకు వచ్చాయి. కోర్టు నోటీసుల పేరుతో గ్రామాల్లో పన్నుల వసూళ్లకు అధికారులు బెదిరింపు కుట్ర'పన్ను'తున్నారు. చిలమత్తూరు మేజర్ పంచాయతీలో పన్నులు చెల్లించని వారికి గత నాలుగు రోజులుగా కోర్టు నుంచి నోటీసులు అందుతున్నాయి. దీంతో పేదలు హడలెత్తిపోతున్నారు.

ప్రజాశక్తి-చిలమత్తూరు

గ్రామాల్లో ఉపాధి లేక ఇప్పటికే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు నిధుల లేమితో గ్రామాల అభివృద్ధి ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది. పంచాయతీలకు ప్రభుత్వ నుంచి రావాల్సిన ఆర్థిక సంఘం నిధులు అందక పోవడంతో జనరల్ ఫండ్‌పై ఆధారపడాల్సిన పరిస్థితి నెల్కొంది. దీని కారణంగా ఇంటి, కొళాయి పన్నుల వసుల్లే లక్ష్యంగా ప్రభుత్వం కోర్టు నోటీసులు పంపి ముక్కు పిండి వసుళ్లు చేసేందుకు చర్యలు తీసుకుంటోంది. గ్రామాల్లో ఎలాంటి అభివద్ధి కార్యక్రమాలు చేపట్టకపోవడంతో సర్పంచులపై ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేఖత వ్యక్తం అవుతోంది.



నోటీసు
ప్రిలిటిగేషన్ కేసు నెం. 72978 /2022

యజమాని పేరు	చిరునామా	పన్నుల బకాయి వివరములు	అస్సెస్మెంట్ నెం.	సంవత్సరము	మొత్తము రూ. (అరియర్ & కరెంటు)
Gangulappa	13-115, Maravakothapalli, Chilamathur, 515341	ఇంటి పన్నులు	2515	2021-2022 సం// వరకు	943

//By Oder//

K.V. Usha Sree
Superintendent
District Legal Services Auth
ANANTHAPURAMU

Dis.No.1954 Dt : 21/10/2022.

To :
శ్రీ Gangulappa,
13-115, Maravakothapalli,
Chilamathur,

చిలమత్తూరు మేజర్ పంచాయతీలో ఇటీవల ఓ గృహ వినియోగదారినికి ఇంటి పన్ను చెల్లించాలని పంచాయతీ అధికారులు పంపిన కోర్టు నోటీసు

ఇదిచాలదన్నట్లు ఇంటి పన్నులు చెల్లించల్సిందేనంటూ ఏకంగా గ్రామాల్లో కోర్టు నోటీసులు అందించడంతో సర్పంచులు ప్రజల నుంచి మరింత వ్యతిరేకతను మూటకట్టు కుంటున్నారు. మరో వైపు

మేజర్ పంచాయతీలే లక్ష్యం

గత వారం రోజులుగా చిలమత్తూరు మండల కేంద్రంలో ఇంటి, కొళాయి పన్నులు చెల్లించని వారికి కోర్టు నోటీసులను పంచాయతీ అధికారులు పంపుతున్నారు. మేజర్ పంచాయతీలకు లక్ష్యంగా చేసుకుని వీటిని పంపుతున్నారు. చిలమత్తూరు మండలంలో మొత్తం 12 పంచాయతీలు ఉండగా మేజర్ పంచాయతీగా ఉన్న చిలమత్తూరులో మొదటగా కోర్టు నోటీసుల జారీ తంతును మొదలు పెట్టారు. పంచాయతీలో 3470 అసెస్మెంట్‌లు ఉండగా 965 అసెస్మెంట్‌లకు నోటీసులు వచ్చాయి. వీటిని గత ఐదు రోజులుగా పంచాయతీ సిబ్బంది సంబంధిత గృహ యజమానులకు అందజేసి వారితో సంతకాలు సైతం తీసుకుంటున్నారు. ఆ నోటీసుల్లో ఇంటిపన్ను, కొళాయి పన్నులు చెల్లించని కారణంగా ఈ నెల 12 తేదీన కోర్టుకు హాజరు కావాలని పొందుపరిచారు. దీనిని చూసిన ప్రజలు పన్నులు చెల్లించకుంటే కోర్టుకు వెళ్లడం ఏమిటంటూ బెంబేలెత్తుతున్నారు.

వలసల కారణంగానే మొండి బాకాయిలు

ఉమ్మడి అనంతపురం జిల్లా కరువుకు పెట్టింది పేరు. అందులో చిలమత్తూరు మొదటి స్థానంలో ఉంది. ఓ వైపు ప్రభుత్వం సెజ్ పేరుతో బడుగు బలహీన వర్గాల భూములు లాగేసుకోవడం, వ్యవసాయం బాగ తగ్గిపోవడంతో ఇటు రైతు కుటుంబాలతో పాటు, వ్యవసాయ కూలీలు పక్కనే ఉన్న కర్నాటక ప్రాంతం బెంగుళూరుకి వలసలు వెళ్తున్నారు. వలస కుటుంబాలు ఇంట్లో లేకపోవడం ఉన్న వృద్ధుల వద్ద పన్నులు చెల్లించేంత స్థోమత లేక ఇబ్బంది పడుతున్నారు. ఈ నేపథ్యంలో కోర్టు నోటీసులు ఇస్తుండడంపై సంబంధిత గృహ యజమానులు ఆందోళనకు గురవుతున్నారు.

కోర్టు నోటీసులతో భయపెట్టడం తగదు

పన్నుల వసూళ్ల కోసం ప్రజలకు కోర్టు నోటీసులు పంపి భయపెట్టడం దుర్మార్గం. ఇప్పటికే పేద, బడుగు, బలహీన వర్గాలపై అధిక పన్నుల భారాలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వేస్తున్నాయి. మూలిగే నక్కపైన తాటికాయ పడిన చందంగా పన్నుల వసూలుకు కోర్టు నోటీసులు పంపడం దారుణమైన చర్య. గ్రామాల్లో ప్రజలకు కావాల్సిన మౌలిక వసతులు కల్పనపై దృష్టి సారించకుండా ప్రభుత్వాలు పన్నుల వసూళ్లతో ఆదాయం పెంచుకోవాలని చూస్తున్నాయి. పేదలను భయభ్రాంతులకు గురి చేసేలా ఉన్న కోర్టు నోటీసులు పంపే ప్రక్రియను తక్షణం నిలుపుదల చేయాలి. లేకుంటే సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళనలు నిర్వహిస్తాం.

ఫిరంగ ప్రవీణ్, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు.

లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకుందాం

డిఐజి రవిప్రకాష్

ప్రజాశక్తి-అనంతపురం



డిఐజి రవిప్రకాష్

ఈ నెల12వ తేదీన జరిగే లోక్ అదాలత్ కార్యక్రమంలో వివిధ రకాల కేసులన్నింటినీ రాజీమార్గం ద్వారా పరిష్కరించుకునేలా దానిని సద్వినియోగం చేసుకోవాలని డిఐజి రవిప్రకాష్ పోలీసు సిబ్బందికి సూచించారు. శనివారం ఉదయం ఆయన అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లా పోలీసు ఉన్నతాధికారులతో టెలీ కాన్ఫిరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనంతపురం జిల్లాలో విచారణలో ఉన్న 7800 కేసులు, శ్రీసత్యసాయి జిల్లాలో ఉన్న 13 వేల కేసులను ఈ నెలాఖరుకల్లా 80 శాతం తగ్గించాలన్నారు. ఈ కేసుల్లో అరెస్టులు, దర్యాప్తులు పెండింగ్‌లో ఉంటే త్వరితగతిన పూర్తి చేసి ఛార్జిషీట్లు వేయాలన్నారు. అనంతపురం జిల్లాలో ఉన్న 2 వేల ఎక్సైజ్ కేసులు, శ్రీసత్యసాయి జిల్లాలో ఉన్న 5,600 ఎక్సైజ్ కేసులను తగ్గించాలన్నారు. కేసులను ఎస్పీలు సమీక్ష చేసి సీజ్ చేసిన వాహనాల డిస్పోజల్‌లో సంబంధిత పోలీసు అధికారులు చట్టపరంగా వ్యవహరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉభయ జిల్లాలో 350 వరకు మిస్సింగ్ కేసులు ఉన్నాయని, వీటిలోనూ పురోగతి పెంచాలన్నారు. వచ్చే నెలలో జరగనున్న లోక్‌అదాలత్ కేసులు పరిష్కారం అయ్యేలా దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీలు డా॥ఫక్కీరప్ప, రాహుల్‌దేవ్ సింగ్‌తో పాటు ఉమ్మడి అనంతపురం జిల్లా డీఎస్పీలు, సిఐలు పాల్గొన్నారు.

తగాదాలకు దూరంగా ఉందాం



చట్టాలపై అవగాహన కల్పిస్తున్న సివిల్‌జడ్జి

ఓబులదేవర చెరువు : తగాదాలకు దూరంగా ఉంటూ భవిష్యత్ తరాలకు ప్రోత్సహిద్దామని సీనియర్ సివిల్ జడ్జి వెంకటేష్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మండల న్యాయసేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా జడ్జి మాట్లాడుతూ ఆర్థిక స్తోమత లేనివారికి ఉచిత న్యాయాన్ని అందించడానికి న్యాయస్థానం ఉచితంగా న్యాయవాదిని ఏర్పాటుచేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు శివశంకర్, వీరనారాయణ, ఎఎస్ఐ కిషోర్ రెడ్డి, ప్రజలు పాల్గొన్నారు.

కదిరి టౌన్ : ప్రతి ఒక్కరూ న్యాయ సేవలపై అవగాహన పెంపొందించుకోవాలని మండల న్యాయ సేవాధికారి సంస్థ చైర్మన్ న్యాయమూర్తి వెంకటేశ్వరరావు సూచించారు. హైకోర్టు న్యాయ సేవాధికార సంస్థ, జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆదేశాలు మేరకు అక్టోబర్ 31వ నుంచి నవంబర్ 13 వరకు న్యాయ విజ్ఞాన సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. పార లీగల్ వాలెంటీర్లు ప్రతి గ్రామంలోనూ ప్రతి ఇంటికి వెళ్లి ఉచిత న్యాయ సేవలపై వివరిస్తారన్నారు. అందులో భాగంగా పట్టణంలోని నిజాంవలి కాలనీలో ఏర్పాటు చేసిన న్యాయ సదస్సులో మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ వెంకటేశ్వరరావు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జితో పాటు అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కుమారి మీనాక్షి సుందరి, కదిరి సీనియర్ న్యాయవాది కే నరసింహులు, రెడ్ సంస్థ ప్రతినిధి భానుజా తదితరులు పాల్గొన్నారు.

రొద్దం : పలు రకాల కేసులను లోక్ అదాలత్‌లో పరష్కరించుకోవాలని పెనుగొండ జూనియర్ సివిల్ జడ్జి కోరారు. శనివారం మండలంలోని బోక్సంపల్లి, కోగిర, కంబాలపల్లి, కంచి సముద్రం, శాపురం గ్రామాల్లో న్యాయసేవా అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కోర్టు సిబ్బందితో పాటు ఎస్ఐ నాగస్వామి, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వ్యాఖ్యలు సరికాదు : టిడిపి



సమావేశంలో పాల్గొన్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి -పెనుకొండ

టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవితమ్మపై స్థానిక ఎమ్మెల్యే శంకరనారాయణ చేసిన వ్యాఖ్యలు సరికాదని టిడిపి నాయకులు అన్నారు. పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్ లోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నాయకులు మాట్లాడారు. సవితమ్మ అసలు బీసీనే కాదని ఆమె భర్త కమ్మ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి అని మాట్లాడారన్నారు. తల్లిదండ్రులు ఏకులం అయితే వారి పిల్లలు అదే కులమని చట్టం చెప్తుందన్నారు. ఇలాంటి బురదచెల్లే రాజకీయాలు మానుకోవాలని హితవు పలికారు. ఈ సమావేశంలో నాయకులు శ్రీరాములు, సూర్యనారాయణ, నీరుగంటి చంద్రశేఖర్, ప్రసాద్, త్రివేంద్ర నాయుడు, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

నాట్యంపై ఉచిత వర్క్‌షాప్ ప్రారంభం

హిందూపురం : అభిజ్ఞా నృత్యాలయం డైరెక్టర్ చంద్రభాను చతుర్వేది ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించే భరతనాట్య, కూచిపూడి ఉచిత వర్క్ షాప్‌ను రాజధాని ఫంక్షన్ హాలులో శనివారం ప్రారంభించారు. పట్టణంలోని వివిధ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు వర్క్ షాపులో పాల్గొని నాట్యంపై మెళకువలు నేర్చుకున్నారు. అనంతరం విద్యార్థులకు హెల్పింగ్ హ్యాండ్ ఫౌండేషన్ ద్వారా సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆధ్యాత్మికవేత్త అశ్వర్థనారాయణ స్వామిజీ, ఎంఇఒ గంగప్ప, లక్ష్మీవిలాస్ యజమాని రంగారావు, ఆర్ట్ ఆఫ్ లివింగ్ శ్రీనివాసరెడ్డి, పర్యావరణవేత్త బాస్కర్‌రెడ్డి, హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండర్స్ భగీరధ నవీన్, శ్రీధర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు అందజేత

కదిరి టౌన్ : ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో కరప్షన్ ఫ్రీ ఇండియా ఫార్ డెవలపింగ్ ఇండియా విజిలెన్స్ వారోత్సవాలలో భాగంగా శనివారం పట్టణంలోని మున్సిపల్ హైస్కూల్‌లో హెచ్‌ఎం నాగరాజు అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీజీబీ రీజినల్ మేనేజర్ కె రవీంద్రా రెడ్డి మాట్లాడుతూ కరప్షన్ లేని ఇండియా దిశగా భారత్ ముందుకు సాగాలంటే విద్యార్థులు కీలకపాత్ర పోషించాలన్నారు. ఈసందర్భంగా ఆరవ తరగతి నుండి పదవ తరగతి విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి ప్రతిభ కనపర్చిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. ఈసందర్భంగా రిటైర్డ్ టీచర్ కే మల్లారెడ్డి మేనేజర్ శ్రీనివాసులు పాఠశాలకు ప్రింటర్ వితరణ చేశారు. ఈకార్యక్రమంలో 34 వ వార్డు కౌన్సిలర్ గిరిజమ్మ, రీజనల్ ఆఫీస్ సీనియర్ మేనేజర్ ఎస్ మహబూబ్ బాషా, ఏపీజీబీ మెయిన్ బ్రాంచ్ సీనియర్ మేనేజర్ జి శ్రీనివాసులు, ఎంజీ రోడ్డు ఏపీజీబీ మేనేజర్ సి వి చలపతి,ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు

రుద్రప్పకు ఘన నివాళి

హిందూపురం : ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, కమ్యూనిస్టు నేత బోయ చెట్ల రుద్రప్ప శుక్రవారం రాత్రి అనారోగ్యంతో కళ్యాణదుర్గంలో మృతిచెందాడు. ఆయన మృతికి లైఫ్ వరల్డ్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్‌లో సంతాప సభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఉదయ్‌కుమార్, సిపిఎం పట్టణ కార్యదర్శి వినోద్‌కుమార్, ఆర్‌సిపి నాయకులు శ్రీనివాసులు, సిపిఎం నరసింహప్ప, కెవిపిఎస్ రమణ, మధు, సిఐటియు భగత్ సింగ్ ఆటో యూనియన్ నాయకులు రామకృష్ణ, సునీల్, రమేష్, నగేష్, ఎమ్మార్పీఎస్ నాగార్జున, టైలర్ గంగాధర్, మల్లికార్జున, వైసిపి రహమత్, సోమశేఖర్ రెడ్డి, టిడిపి దేశాయ్ మురళి, సునీల్, వాల్మీకి సంఘం నాయకులు ముద్దరంగప్ప, కాలవ రాము, బిఎన్ మూర్తి, వెంకటేశ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



రుద్రప్ప చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

పరిగి : ప్రజా సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్థానిక ఎమ్మెల్యే శంకర్నారాయణ పేర్కొన్నారు. శనివారం పరిగి మండల కేంద్రంలోని సీతారాంపురం పార్టీ హౌసెస్ కాలనీలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఈసందర్భంగా ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులతో పాటు నాయకులు, సర్పంచి లక్ష్మీదేవి, ఎంపీటీసీ లక్ష్మి ప్రభాకర్, శివశంకర్, మాజీ ఎంపీపీ గోవిందప్ప శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి రూరల్: మండల పరిధిలోని ప్రశాంతి గ్రామ్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వద్ద శనివారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన ఇంటింటికి తిరిగి ప్రజాసమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో 19వ వార్డ్ కౌన్సిలర్ లక్ష్మీదేవి, పుడా చైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ, జిల్లా వ్యవసాయ సలహా మండల అధ్యక్షులు ఆవుటాల రమణారెడ్డి, నెడ్ క్యాప్ డైరెక్టర్ మాధవరెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఓబుళపతి, ఎంపీపీ రమణారెడ్డి, వైస్ చైర్మన్ లక్ష్మి, తిప్పన్న, కన్వీనర్లు రంగారెడ్డి, నరసారెడ్డి, కౌన్సిలర్లు, వైసిపి నాయకులు, కార్యకర్తలు, ఆయాశాఖల అధికారులు పాల్గొన్నారు.





సమస్యలు అడిగి తెలుసుకుంటున్న పెనుకొండ, పుట్టపర్తి ఎమ్మెల్యేలు

హత్యకేసు నిందితులను గుర్తిస్తాం : ఎఎస్పీ

అమరాపురం : మండల పరిధిలోని హేమవతి గ్రామంలో జరిగిన పురోహితుని హత్యకేసు నిందితులను త్వరలోనే గుర్తించి వారిని అరెస్టు చేస్తామని ఎఎస్పీ రామకృష్ణప్రసాద్ తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం హేమావతిలో పర్యటించి హత్యకేసు వివరాలను సేకరించారు. ఈసందర్భంగా ఎఎస్పీ మాట్లాడుతూ సంఘటన స్థలంలో లభించిన ప్రాథమిక ఆధారాల ద్వారా మడకశిర సిఐ నాగరాజు రావు ఆధ్వర్యంలో దర్యాప్తు ప్రారంభించామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్ఐ వెంకటేశ్వర్లు, పోలీసులు పాల్గొన్నారు.

ఇంటెలిజెన్స్ అధికారులతో విచారణ జరిపించాలి.

గుడిబండ : హేమావతి గ్రామంలో పురోహితుడు శశిధర్ స్వామి హత్యకేసును ఇంటెలిజెన్స్ అధికారులతో విచారణ జరిపించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు సముద్రాల హనుమంతరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన శనివారం హేమావతి గ్రామానికి వెళ్లి పురోహితుడు శశిధర్ స్వామి హత్యపై ఆరా తీశారు. అనంతరం. గుడిబండ మండలం కరికెర గ్రామానికి వెళ్లి అక్కడ సత్య సాయి జిల్లా బ్రాహ్మణుల సంఘం జిల్లా కార్యదర్శి రవి స్వామి ఇంటిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ స్పందించి ఇంటెలిజెన్స్ అధికారులతో విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంఘం కార్యదర్శి గురుమూర్తి స్వామి, జిల్లా కార్యదర్శి రవిశంకర్ స్వామి, వెంకట్రావు, చంద్రమౌళి, సాయినాథ్, రఘు, శ్రీనాథ్, మురళి తదితరులు పాల్గొన్నారు.

వీరాపురాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేస్తాం

ప్రజాశక్తి - చిలమత్తూరు

జీవ వైవిధ్యంలో ఆదర్శంగా ఉన్న సైబీరియన్ పక్షుల వలస కేంద్రం వీరాపురాన్ని పర్యాటక కేంద్రంగా మరింత అభివద్ధి చెందేందుకు ప్రతి ఒక్కరు కషి చేయాలని అందుకు తాము సహయ సహకారాలు అందిస్తామని సెంట్రల్ టీం డెహ్రాడూన్‌కు చెందిన జ్యూరీ సభ్యులు డాక్టర్ శృతిశర్మ, ఢిల్లీకి చెందిన ఎకె. గుప్త తెలిపారు. జాతీయ స్థాయిలో ఉత్తమ జీవ వైవిధ్య యాజమాన్య కమిటిగా నామినేట్ అయిన సందర్భంగా క్షేత్ర స్థాయి పర్యటకు వారు శనివారం వీరాపురానికి వచ్చారు. రష్యాలోని సైబీరియన్ ప్రాంతం నుండి వలస వచ్చి సంతానోత్పత్తి చేసుకోనే పక్షులను సంరక్షిస్తూ తమతో మమేకమై ఆదర్శవంతంగా సరికొత్త జీవ వైవిధ్యాన్ని పెంపొందిస్తున్న బిఎంసి కమిటి కృషి అభినందనీయమని అన్నారు. ఆంధ్రప్రదేశ్ జీవ వైవిధ్య మండలి ద్వారా 2008 లో ఏర్పడిన కమిటీ స్వశక్తితో స్థానిక ప్రజా ప్రతి నిధులు, అధికారుల సహకారంతో, శ్రీ క్రిష్ణ దేవరాయ విశ్వ విద్యాలయం సహకారంతో పక్షుల సంరక్షణకు చర్యలు చేపట్టిందన్నారు. పక్షులను సంరక్షించడం, వాటికి ఆహారమందించడం, నీటి నిల్వలకు కుంటలు ఏర్పాట చేయడం లాంటికార్యక్రమాలు చేపట్టడంతో ఇంత ప్రగతి సాధ్యమైందన్నారు. అయితే ఈ ప్రాంతాన్ని పర్యాటకంగా కూడా అభివృద్ధి చేస్తేనే మరింత వనరులు సమకూరుతాయని అన్నారు. అనంతరం స్థానిక ప్రజాప్రతినిధులు కమిటీ సభ్యులను, జ్యూరీ సభ్యులను సన్మానించారు. పక్షులను మరింత సంరక్షణ చేయడానికి కేంద్రం సహకారం అవసరమని సభ్యులకు విన్నవించారు. ఆమేరకు ప్రయత్నాలు చేస్తామని జ్యూరీ సభ్యులు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర జీవ వైవిధ్య మండలి రాష్ట్ర కో ఆర్డినేటర్ డాక్టర్ ఎల్ వరలక్ష్మి, ఎంపిడిఒ రామ్‌కుమార్, అటవీ శాఖ ఆధికారులు, చిలమత్తూరు ఎంపిపి పురుషోత్తమ రెడ్డి, వీరాపురం సర్పంచి లక్ష్మీపతిరెడ్డి, శివప్రసాద్‌రెడ్డి, నరసింహారెడ్డి, వేణు, కార్యదర్శి కేశవ మూర్తి, సచివాలయ సిబ్బంది విశ్వనాథ్, నజ్జు, స్థానిక జీవ వైవిధ్య ,పక్షుల సంరక్షణ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జ్యూరీ సభ్యులు

15న పారిశుధ్య కార్మికుల సమావేశం

తలుపుల : మండలంలోని పారిశుధ్య కార్మికులతో ఈనెల 15న మండలస్థాయి సమావేశం నిర్వహిస్తున్నామని సిఐటియు నాయకులు సాంబ తెలిపారు. స్వచ్ఛభారత్ కార్మికులకు పెండింగ్ వేతనాలు, ఇతర సమస్యలపై ఈ సమావేశంలో చర్చిస్తామన్నారు. మండలంలోని ఆయా గ్రామాల్లో పనిచేసే కార్మికులు ఈ సమావేశానికి హాజరుకావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామకృష్ణతో పాటు కార్మికులు మహబూబ్‌బాషా, అశోక్, రమణ, కాశీ, దస్తగిరమ్మ, నారాయణమ్మ, వెంకటేశు తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు ఆర్థికసాయం

నల్లమాడ : మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన బాధితులకు మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి ఆర్థికసాయం అందజేశారు. మండల పరిధిలోని మూలపు గారి పల్లి, మసక వంకపల్లి, బుగ్గలపల్లి తదితర గ్రామాల్లో ఆయన శనివారం పర్యటించారు. బాధిత కుటుంబాలను కలిసి ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ మైలే శివశంకర్, మాజీ కన్వీనర్ దన్నీకోట కేశవరెడ్డి, ఎల్ఐసి నరసింహులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుందాం

కదిరి టౌన్ : పట్టణవ్యాప్తంగా ప్రతి ఒక్కరూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ సిబ్బంది తెలిపారు. మున్సిపల్ చైర్మన్ నజీమున్నీసా, కమిషనర్ శ్రీ హరి బాబు ఆదేశాల మేరకు పట్టణంలో పారిశుధ్యం మెరుగుకోసం తడి, పొడి చెత్త వేయడానికి రెండు రంగుల డబ్బాలను అందజేసినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు పర్యావరణ, పారిశుధ్య విభాగం సిబ్బంది, శ్రీ శారద స్కూల్ యాజమాన్య సభ్యులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు

తాడిమర్రి : ప్రజాసమస్యల పరిష్కారానికి అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని ఎంపిపి పాటిల్ భువనేశ్వర్‌రెడ్డి ఆదేశించారు. ఎంపిపి ఆధ్వర్యంలో స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మండలంలోని ఆయా శాఖల పరిధిలో జరుగుతున్న అభివృద్ధిపై సమావేశంలో చర్చించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు బిసాని లింగమ్మ, కృష్ణమనాయుడు, ఎంపీడీవో విజయలక్ష్మి, తహశీల్దార్ పాశే నాగరాజుతో పాటు ఆయా శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యకేంద్రాల తనిఖీ

నల్లమాడ : మండలంలోని పలు ఆరోగ్యఉపకేంద్రాలను జిల్లా వైద్యాధికారి ఎస్‌వి కృష్ణారెడ్డి శనివారం తనిఖీ చేశారు. స్థానిక పిహెచ్‌సిలో ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమాన్ని పరిశీలించారు. అనంతరం రెడ్డిపల్లి ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఆసుపత్రిలో రికార్డులను పరిశీలించారు. కొత్తపల్లి తండాలో వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ దీప్తి, డాక్టర్ ప్రణ్య, సిహెచ్ఓ రామాంజనేయులు, సూపర్వైజర్ మంజులమ్మ, సిబ్బంది ప్రమీలమ్మ, రామచంద్ర, శిరీష తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు ఆర్థికసాయం

ముదిగుబ్బ : మండల కేంద్రంలో అనారోగ్యంతో బాధపడుతున్న పలువురు బాధితులకు ధర్మవరం నియోజకవర్గం సామాజికవేత్త గడ్డం రాజగోపాల్ శనివారం ఆర్థికసాయం అందజేశారు. ఎస్సీ కాలనీకి చెందిన అక్బర్ సాహెబ్ కుటుంబానికి రూ.15వేలు, కస్తూరిబాయ్ కాలనీలో నివాసమున్న లక్ష్మన్న కుటుంబానికి రూ.10వేలు అందజేశారు.

నాడు - నేడు పనులు ప్రారంభం

చిలమత్తూరు : మండలంలోని దేమకేతేపల్లి పంచాయతీలోని బ్రహ్మేశ్వరంపల్లి ప్రాథమిక పాఠశాలలో నాడునేడు పథకం కింద చేపట్టిన పనులను ఆ గ్రామ సర్పంచి తిరుమలేష్ శనివారం ప్రారంభించారు. భవనాల మరమ్మతులు, నూతన మరుగుదొడ్ల నిర్మాణం, తాగు నీటి సౌకర్యం, పెయింటింగ్ మొదలగు పనుల కొరకు రాష్ట్ర ప్రభుత్వం 12 లక్షల రూపాయలు కేటాయించిందని సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శంకర్ నారాయణ, పేరెంట్స్ కమిటీ చైర్మన్ రవీంద్రా రెడ్డి, ఇంజనీరింగ్ అసిస్టెంట్ శరత్, వెల్ఫేర్ అసిస్టెంట్ అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగవిరమణ సన్మానసభ

కదిరి టౌన్ : కదిరి ఆర్టీసీ డిపోలో కండక్టరుగా పనిచేసిన వాల్మీకిసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బండారు క్రిష్ణమూర్తి పదవీ విరమణ సన్మానసభను శనివారం నిర్వహించారు. ఈసందర్భంగా క్రిష్ణమూర్తి మాట్లాడుతూ సమాజంలో గుర్తింపు ఇచ్చిన ఆర్టీసీని తాను మరవనని అన్నారు. ఈసందర్భంగా వక్తలు మాట్లాడుతు క్రిష్ణమూర్తి చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డిపో అసిస్టెంట్ మేనేజరు హరిమోహన్‌తో పాటు ఉద్యోగసంఘాల నాయకులు గోపాలక్రిష్ణ, రిటైర్డు ఉద్యోగులు ఇలాయత్ అలీ, ఆరిపుల్లా, రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికతో లక్ష్యాన్ని చేరండి

హిందూపురం : వివేకానందుని స్ఫూర్తితో లక్ష్యాన్ని రూపొందించుకొని ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్లాలని హిందూపురం మున్సిపల్ కమిషనర్ డాక్టర్ వెంకటేశ్వరరావు విద్యార్థినులకు పిలుపునిచ్చారు. స్థానిక ఎన్ఎస్‌పిఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల మొదటి సంవత్సరంలో ప్రవేశం పొందిన విద్యార్థినులకు 21 రోజుల పాటు జరుగుతున్న ఇండక్షన్ కార్యక్రమంలో భాగంగా శనివారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రగతి అధ్యక్షతన జరిగిన ప్రారంభసభలో మున్సిపల్ కమిషనర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఇండక్షన్ పోగ్రాం కోఆర్డినేటర్ వెంకటేశులు, అధ్యాపకులు యశోద రాణి, శ్రీలక్ష్మి, సరస్వతి, పార్వతి, సుమంగళి, శ్రీధర్, భోజప్ప, పోలయ్య, అశ్వర్థప్ప తదితరులు పాల్గొన్నారు.

హెల్త్ అలవెన్స్ రికవరీ ఆలోచనను ఉపసంహరించుకోవాలి



హిందూపురంలో నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు, నాయకులు

ధర్మవరం టౌన్ : పారిశుధ్య కార్మికులకు ఇచ్చే హెల్త్ అలవెన్సును రికవరీ చేయాలన్న ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జెవి. రమణ, పారిశుధ్యకార్మిక సంఘం వర్కింగ్ ప్రసిడెంట్ పుల్లన్న డిమాండ్ చేశారు. పారిశుధ్య కార్మికుల హెల్త్ అలవెన్స్ రికవరీని నిరసిస్తూ ధర్మవరం మున్నిపాలిటీ కార్యాలయం ఎదుట శనివారం సిఐటియు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమంలో నిర్వహించారు. అనంతరం కార్యాలయ ఎఫ్-1 ఆనంద్‌కు వినతి పత్రం అందజేశారు. సమస్యలపై స్పందించకపోతే రాష్ట్ర కమిటీ పిలువు మేరకు ఆందోళన కార్యక్రమాలను చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పారిశుధ్య కార్మికసంఘం నాయకులు బాబు, చెన్నకేశవులు, వెంకటేశ్, ప్రసాద్. రమేశ్, ముకుంద, నారాయణస్వామి, శ్రీనివాసులు, దుర్గమ్మ, సర్వమ్మ, పెద్దక్క, ముత్యాలమ్మ, వీర, మంజు, ఓంప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం : పురపాలక సంఘంలో విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికులకు హెల్త్ అలవెన్స్ రికవరీ వెంటనే ఆపాని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు. శనివారం మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ చాంబర్ ముందు ధర్నా నిర్వహించారు. సమస్య పరిష్కరించకపోతే 10వ తేదీ నుండి 20వ తేది వరకు దశలవారీగా ఉద్యమాలు చేపడుతామన్నారు. అప్పటికి ప్రభుత్వం స్పందించిక పోతే ఈనెల 20వ తేదీ నుండి 25 వరకు రాష్ట్రవ్యాప్తంగా సిఐటియు ఆధ్వర్యంలో సమ్మె చేపడతామన్నారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అధికారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ అధ్యక్షులు మల్లికార్జున, కార్యదర్శి జగదీష్, కోశాధికారి ఆనంద్, ఉపాధ్యక్షులు రామాంజనేయులు, మల్లయ్య, మంజు, కృష్ణమూర్తి, నారాయణమూర్తి, సహాయ కార్యదర్శులు చంద్రశేఖర్, నరసింహమూర్తి, శివ, చంద్ర, నాగేంద్రతో పాటు పెద్ద ఎత్తున కార్మికులు పాల్గొన్నారు.

కదిరి టౌన్ : మున్సిపల్ పారిశుధ్య కార్మికులు పోరాడి సాధించుకున్న ఆక్యుపేషనల్ హెల్త్ అలవెన్స్‌ను కార్మికుల వేతనాల నుండి రికవరీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు తమ డిమాండ్లతో కూడినవినతిపత్రాన్ని కదిరి మున్సిపల్ మేనేజర్‌కు శనివాంర అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు జగన్మోహన్, హరినాథ్ రెడ్డి, మున్సిపల్ యూనియన్ నాయకులు జనార్ధన్, నరసింహమూర్తి, కృష్ణకుమార్, చెన్నకృష్ణ, రాజు తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తిఅర్బన్ : నగర పంచాయతీ కార్మికులు పోరాడి సాధించుకున్న అలవెన్సులను వెనక్కి చెల్లించాలని జీవోలు విడుదల చేయడం దుర్మార్గమైన చర్య అని మున్సిపల్ జిల్లా యూనియన్ కార్యదర్శి లక్ష్మీనారాయణ, సిఐటియు మండల కార్యదర్శి గౌస్ లాజాం విమర్శించారు. శనివారం కార్మికులతో పాటు నాయకులు మున్సిపల్ కార్యాలయం ముందు నిరసన తెలిపి ఎఇ స్వాతికి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్మిక సంఘం నాయకులు గోవిందు, పెద్దన్న, రామయ్య, నాగార్జున, నరసింహులు, ఇంజనీరింగ్ కార్మికులు గణేష్, రామదాసు, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ : పారిశుధ్యకార్మికులకు హెల్త్ అలవెన్స్ రికవరీ చేయాలనే రాష్ట్ర ప్రభుత్వం ఆలోచన చాలా దుర్మార్గం అని సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు హరి విమర్శించారు. శనివారం పట్టణంలోని నగర పంచాయతీ కార్యాలయం వద్ద పారిశుద్ధ కార్మికుల సమస్యలపై ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ కార్మికుల యూనియన్ అధ్యక్షులు రిక్షా నర్సింహులు, కార్యదర్శి చిన్న వెంకటేష్, కోశాధికారి వెంకటేష్, సహాయ కార్యదర్శులు తిప్పన్న, ముత్యాలు, ఉపాధ్యక్షులు లక్ష్మీదేవి, శాంతమ్మ, గంగ రత్నమ్మ, నాగమ్మ, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

కొత్తచెరువులో ఘర్షణ

కొత్తచెరువు : మండలకేంద్రానికి సమీపాన పెనుగొండ రహదారిలో జగనన్న కాలనీ పైభాగాన నల్ల కొండ వద్ద మట్టి తవ్వకాల విషయంలో శుక్రవారం ఘర్షణ చోటు చేసుకుంది. శుక్రవారం రాత్రి జెసిపి ద్వారా ట్రాక్టర్లలో మట్టిని తరలిస్తున్నారని తహశీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై రెండు వర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. అందుకు సంబందించి గ్రామస్తులు తెలిపిన వివరాలు జెడ్పీటీసీ భర్త మటన్ శంకర్ కొండను తవ్వి ఆ మట్టిని బయట వ్యక్తులకు విక్రయిస్తున్నారు. ఈ విషయంపై లింగారెడ్డి పల్లికి చెందిన హరి ఫోన్ ద్వారా తహశీల్దార్‌కు ఫిర్యాదు చేశాడన్న ఆనుమానంతో ఈ రెండువర్గాలు శనివారం ఉదయం ధర్మవరం రోడ్డు వద్ద ఘర్షణ పడ్డాయి. ఈఘర్షణపై ఇరువర్గాల వారు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసుకున్నారు. వీటిని విచారణ నిర్వహించి తగిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ లింగన్న తెలిపారు

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

నల్లచెరువు : మండల పరిధిలోని ఎర్రగుంటపల్లి వద్ద జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. గ్రామస్తులు తెలిపిన వివరాలు... తురకవానిపల్లికి చెందిన శ్రీనివాసులు, భార్గవి, బిట్టు ద్విచక్ర వాహనంపై వస్తుండగా జాతీయ రహదారిపై వేగంగా వస్తున్న కారు వీరి వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వారిని కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వరలక్ష్మి తెలిపారు.

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

మడకశిర రూరల్ : మండల పరిధిలోనే జీవి పాలెం గ్రామానికి చెందిన వ్యక్తి మృతదేహం గ్రామ సమీపంలోని బావిలో లభ్యమైంది. గ్రామానికి చెందిన నంజప్ప (53) రెండు రోజుల క్రితం గ్రామ సమీపంలోని బావిలో ప్రమాదవశాత్తు కాలుజారి పడిపోయాడు దీంతో అగ్నిమాపక సిబ్బంది వ్యక్తి మృతదేహం బయటికి తీయడానికి ప్రయత్నించారు. ఫలితం లేకపోవటంతో బావిలో నీటిని తోడేసి మృతదేహాన్ని శనివారం బయటకు తీశారు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పారదర్శకంగా ఓటరు నమోదు

కదిరి టౌన్ : ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదును పారదర్శకంగా చేపట్టాలని సిపిఎం నాయకులు కోరారు. ఈ మేరకు వారు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆర్డీవో రాఘవేంద్రకు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓటు నమోదు చేసుకున్న పట్టభద్రుల, ఉపాధ్యాయుల సర్టిఫికెట్లను పరిశీలించడానికి నియమించిన బిఎల్ఒలు క్షేత్రస్థాయిలో వెళ్లి పరిశీలించడం లేదని విమర్శించారు. కేవలం ఫోన్‌ద్వారా ఓటర్లను సంప్రదించి వారి సర్టిఫికెట్లను తీసుకొని రావాలని కార్యాలయాలకు పిలిపించుకుంటున్నారన్నారు. అలాగే కొన్ని ప్రాంతాల్లో వాలెంటీర్లు వెరిఫికేషన్ చేస్తున్నారన్నారు. అలాగే కొన్ని చోట్ల హిందీలో డిగ్రీలు పొందిన వారిని అనర్హులుగా చెబుతున్నారన్నారు. జిల్లా అధికారులు స్పందించి బిఎల్ఒలకు అవగాహన కల్పించి విధులు సక్రమంగా నిర్వహించేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బడా సుబ్బిరెడ్డి, పట్టణ కార్యదర్శి జిఎల్. నరసింహులు, నాయకులు హరినాథ్ రెడ్డి, జగన్మోహన్, ఫైరోజ్ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

తల్లిదండ్రుల నమ్మకాన్ని నిలబెట్టండి

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

తల్లిదండ్రుల నమ్మకాన్ని వారి పిల్లలు నిలబెట్టాలని ప్రభుత్వ బాలికల కళాశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ బండి వేణుగోపాల్ కోరారు. ఈ మేరకు కళాశాలలో ఫ్రెషర్స్ డేను శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన బండి వేణుగోపాల్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థిని ఇష్టపడి చదివి ఉన్నతస్థాయికి చేరుకుని సమాజంలో మంచి గుర్తింపును తెచ్చుకోవాలన్నారు. ఈసందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ లక్ష్మీకాంతరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాద మృతుల కుటుంబ సభ్యులకు ఉద్యోగం

ప్రజాశక్తి - తాడిమర్రి

మండలంలోని చిల్ల కొండయ్య పల్లిసమీపంలో విద్యుత్ హై టెన్షన్ వైరు తెగి ఆటో మీద పడడంతో ఆరుగురు మృతిచెందిన ఘటనలో మృతుల కుటుంబాల్లోని పిల్లలకు ఉద్యోగవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది. మృతుల కుటుంబ సభ్యులకు అప్పట్లో పరిహారం అందజేసే సమయంలో ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ఇచ్చిన హామీ మేరకు మృతుల కుటుంబంలోని పిల్లలకు ఉద్యోగవకాశం కల్పించారు. వారికి విద్యుత్‌శాఖలో ఉద్యోగాలు ఇస్తున్నట్లు ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పత్రాలను శనివారం అందజేశారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు : ఎఎస్పీ

హిందూపురం : సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎఎస్పీ కెవి రామకృష్ణ ప్రసాద్ హెచ్చరించారు. శనివారం పట్టణంలోని వన్ టౌన్ స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ నిర్వహణ, సిబ్బంది పనితీరు, విధులు, ముఖ్యమైన కేసుల దర్యాప్తు, స్టేషన్‌లో నిర్వహిస్తున్న కేసు డైరీ, విలేజ్ రోస్టర్‌ను పరివీలించారు. సబ్ డివిజన్ పరిధిలో ఈ మధ్యకాలంలో జరిగిన సంఘటనలు దృష్టిలో ఉంచుకొని సిబ్బంది ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వన్ టౌన్ సిఐ ఇస్మాయిల్, సిబ్బంది పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న ఎఎస్పీ



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

విరివిగా ఉపాధి పనులు కల్పించాలి : కలెక్టర్

పుట్టపర్తి,రూరల్ : గ్రామాల్లో కూలీలకు ఉపాధి పనులు కల్పించాలని జిల్లా కలెక్టర్ బసంత్ కుమార్ ఆదేశించారు. శనివారం స్థానిక కలెక్టరేట్‌లోని స్పందన హాలులో జరిగిన కార్యక్రమంలో పనులు గుర్తింపుచ ప్రణాళిక ప్రక్రియ తదితర వాటిపై ఏపీడీలు ఎంపీడీవోలు, ఏపీవోలు, ఈసీలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కలెక్టర్‌తో పాటు డిడబ్ల్యు ఎంఎ పీడీ రామాంజనేయులు పాల్గొన్నారు ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్లాంటేషన్ పనులు వేగవంతం చేయాలన్నారు. చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలు పరిశుభ్రంగా ఉండే విధంగా కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. గ్రామీణ ప్రాంతాలలోని కులీలందరికి వలసలు వెళ్లకుండా పనులు కల్పించాలని సూచించారు. చక్కని బడ్జెట్ తయారుచేసి ప్రజలకు ఉపయోగపడే విధంగా పనులు చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచి జ్యోతి రామకృష్ణ మృతి

పుట్టపర్తిఅర్బన్ : మాజీ సర్పంచి జ్యోతి రామకృష్ణ(74) శనివారం మృతి చెందారు. గత కొంతకాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆయన ఎనుములపల్లి సర్పంచ్ గా రెండుసార్లు ఎన్నికయ్యారు. ఆర్టీసీ యన్ యం యు పుట్టపర్తి డిపో అధ్యక్షునిగా రెండుసార్లు ఎన్నికయ్యారు. మొదటి నుంచి ఆయన కాంగ్రెస్ పార్టీలో ఉంటూ పార్టీ అభివృద్ధికి తన వంతు కషి చేశారు. వైసిపి ఆవిర్భవించిన తర్వాత ఆ పార్టీలో చేరారు. సర్పంచిగా పంచాయతీ అభివృద్ధికి ఎంతో కషి చేశారు. ఆయన మృతిపట్ల మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, శాసనసభ్యుడు దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. ఆయన మతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యంగా ఉండాలన్నారు. కాంగ్రెస్ ఎఐసిసి సభ్యుడు కోటా సత్యం, మున్సిపల్ చైర్మన్ ఓబుళపతి, వైస్ చైర్మన్ శ్రీ లక్ష్మీ నారాయణ రెడ్డి, కౌన్సిలర్లు సూర్య గౌడ్, సాయి గీత, చెరువు భాస్కర్ రెడ్డి, పలువురు వైసీపీ నాయకులు నివాళులర్పించారు.

ప్రతిపక్ష నాయకులపై దాడులు అమానుషం

పెనుకొండ : రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగుతోందని చెప్పడానికి ప్రతిపక్ష నాయకులపై జరుపుతున్న దాడులే నిదర్శనమని టీడీపీ మండల కన్వీనర్ సిద్దయ్య, టీడీపీ పట్టణ కన్వీనర్ రవిశంకర్ అన్నారు. ఈ మేరకు వారు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కాన్వాయ్‌పై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

కాలువ మరమ్మతులకు శ్రీకారం

అధికారులు పట్టించుకోకపోవడంతో సొంతనిధులతో పనులు చేపట్టిన రైతులు



కాలువ మరమ్మతు పనులు చేయిస్తున్న రైతులు

ప్రజాశక్తి - పరిగి

ఖరీఫ్ సీజన్లో సాగుచేసిన పంటలు కాలువలు మరమ్మత్తులు లేక ఎండిపోతున్నాయని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ స్పందించకపోవడంతో పంటలను కాపాడుకోవడానికి చివరికి రైతులే నడుం బిగించారు. తమ సొంతనిధులతో కాలువ మరమ్మతులకు శ్రీకారం చుట్టారు. అందుకు సంబందించిన వివరాలు... ఇటీవల కురిసిన వర్షాలకు పరిగి చెరువు నీటితో నిండింది. అయితే చెరువు నుండి ఆయకట్టుకు నీటిని మళ్లించేందుకు కాలువలు సరిగా లేవు. దీంతో కాలువ మరమ్మతులు చేయాలని రైతులు అధికారులను కోరారు. నెలలు గడిచినా అధికారులు పట్టించుకోకపోవడంతో రైతులు ఓ నిర్ణయానికి వచ్చారు. చందాలు వేసుకుని ఆడబ్బుతో కాలువ మరమ్మతులను శనివారం చేపట్టారు. ఈసందర్భంగా రైతులు మాట్లాడుతూ సమస్యను పలుమార్లు తహశీల్దార్, ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. నిధుల కొరత సాకు చూపించి సమస్యను పట్టించుకోలేదన్నారు. దీంతో తామే చందాలు వేసుకుని సుమారు పది కిలోమీటర్ల మేర ఈ కాలువ మరమ్మతు పనులు చేపట్టినట్లు తెలిపారు. ఈకాలువ పరిధిలో చిన్నపల్లి పరిగి పొలాలకు సంబంధించి సుమారు 500 ఎకరాలకు పైగా భూమి సాగులోకి వస్తుందన్నారు. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా వచ్చినప్పటికీ తీరా పంట చేతికి వచ్చే సమయంలో నీరు లేకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని వాటిని కాపాడుకోవడానికి కాలువ మరమ్మతులకు శ్రీకారం చుట్టామని రైతులు జయన్న సంజీవ వెంకటేష్ తదితరులు తెలిపారు.

పకడ్బందీగా ప్లాస్టిక్ నిషేధం అమలు

ప్రజాశక్తి హిందూపురం

పురపాలక సంఘ వ్యాప్తంగా ప్లాస్టిక్ నిషేధ చట్టాన్ని కఠినంగా అమలు చేస్తామని మున్సిపల్ కమిషనర్ డాక్టర్ వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. శనివారం రాత్రి పట్టణంలోని మెయిన్ బజార్ లో శానిటేషన్ సెక్రటరీలు బృందాలుగా ఏర్పడి షాపులు, గోడౌనులపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో గాంధీ సర్కిల్ సమీపంలో 1.5 టన్నుల ప్లాస్టిక్ కవర్లు డంప్ ఉన్న గోడౌన్‌ను గుర్తించి వాటిని స్వాధీనం చేసుకుని, మున్సిపల్ కార్యాలయానికి తరలించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ డాక్టర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్లాస్టిక్ కవర్ల వాడకం ఆరోగ్యానికి మంచిదికాదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్లాస్టిక్ నిషేధ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని మార్గదర్శకాలు జారీ చేశాయన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్‌పెక్టర్, శానిటరీ సెక్రటరీలు పాల్గొన్నారు.

మృత్యుతీగలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

విద్యుత్ తీగలు ప్రజల పాలిట మృత్యుతీగలుగా మారుతున్నాయి. ఈ వారంలో బొమ్మనహాళ్ మండలంలోని దర్గా హోన్నూరు గ్రామంలో చోటు చేసుకున్న విద్యుద్ఘాతం ఐదుగురి ప్రాణాలను బలి తీసుకుంది. పొలం పనులు ముగించుకుని ఇళ్లకు వెళ్లేందుకు సిద్ధమైన సమయంలో విద్యుత్ తీగ తెగి ట్రాక్టర్‌పై పడటంతో దుర్ఘటన చోటు చేసుకుంది. ఇందులో ఐదుగురు మహిళా వ్యవసాయ కూలీలు మృత్యువాతపడ్డారు. ప్రభుత్వం ఎప్పటిలాగానే ఒక కమిటీని వేయడం, బాధితులకు పరిహారం చెల్లించడం చేసింది. ఇటువంటి ఘటనే జూన్ మాసంలో తాడిమర్రి మండలం చిల్లకొండయ్యపల్లి వద్ద చోటు చేసుకుంది. అప్పుడే ఇదే తరహా చర్యలు తీసుకున్నారు. అయితే ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు మాత్రం తీసుకోలేకపోయారు. ఈ రెండు ఘటనల మధ్య కూడా మరో రెండు ఘటనలే ఇదే తీరున జరగడం గమనార్హం. అయితే వాటిల్లో ఒక్కొక్కరే మృతి చెందడంతో పెద్దగా చర్చనీయాంశమవ్వలేదు. సాధారణ మరణాల లెక్కల్లోకే చేరిపోయారు. ప్రధానమైన విద్యుత్ లైన్లు ఈ రకంగా తెగిపడి మనుషుల ప్రాణాలు పోతుండటం ఆందోళన కలిస్తున్న అంశం. ప్రధానంగా వ్యవసాయ పంపుసెట్లకు వెళ్లే లైన్లే ఈ రకంగా తెగిపడుతున్నాయి. వ్యవసాయ పంపుసెట్లకు నాణ్యతమైన విద్యుత్ అందించే పేరుతో ప్రపంచ బ్యాంకు నిధులతో కొత్త లైన్ల ఏర్పాటును వెయ్యి కోట్ల రూపాయలతో చేపట్టారు. ఇప్పుడు ఈ లైన్లే ఈ రకంగా తెగిపడుతున్నాయి. కొత్తగా అని వేస్తున్న ఈ లైన్లలో చాలా వరకు పాతవాటిని, నాణ్యతలేని వాటిని వాడుతున్నారన్న ఆరోపణలున్నాయి. అందుకే ఎంతో పటిష్టంగా ఉండే వైర్లు చిన్నచిన్న వాటికే తెగిపడిపోతున్నాయి. అదే సమయంలో ట్రిప్ అవ్వాల్సిన వ్యవస్థ పనిచేయడం లేదు. విద్యుత్ వైరు తెగిన వెంటనే ట్రాన్సుఫార్మర్ దగ్గర లైను ట్రిప్ అవ్వాలి. కాని అలా జరుగకుండా విద్యుత్ సరఫరా కొనసాగుతూనే ఉంటోంది. ఇదే ప్రమాదాలకు కారణం అవుతోంది. జిల్లాలో ఏడాదికి సగటున 70 వరకు ఇటువంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. అంటే ప్రతి నాలుగు రోజులకు ఒక ఘటన చోటు చేసుకుంటూ ఉంది. 2029-21 లో 84 ఘటనలు, 20221-22లో 74, ఇప్పుడు ఈ ఏడాది ఇప్పటి వరకు52 ఘటనలు చోటు చేసుకున్నాయి. ఇందులో మనుషులే కాకుండా పశువులు చనిపోతున్నాయి. ఇంత జరుగుతున్నా నివారణ చర్యలు మాత్రం మొక్కుబడి అనే చెప్పాలి. ఎప్పుడో వేసిన తీగలు మార్చకుండా పాతవే కొనసాగిస్తున్నారు. దీంతో తీగల్లో ఉండాల్సినంత బలం లేకుండాపోతోంది. దీంతో తెగిపడిపోతున్నాయి. ఇక వీటిని పర్యవేక్షించే వ్యవస్థ బలంగా లేకపోవడం మరో కారణంగా చెప్పవచ్చు. ప్రతి 600 స్తంభాలకు ఒక లైన్‌మెన్ ఉండాల్సిన చోట పది వేల వరకు ఉంటున్నాయి. దీంతో పర్యవేక్షణ క్షేత్ర స్థాయిలో చేపట్టలేని పరిస్థితి ఉంది. ఈ పనిభారం తగ్గించాల్సి ఉంది. ఏదైనా ఘటన జరిగితే క్షేత్ర స్థాయి సిబ్బందినే బాధ్యులను చేస్తున్నారు. సరైన సామాగ్రి లేక, పనిభారం ఎక్కువ పెట్టి తిరిగి వారిపైనే నెపం నెట్టి ప్రభుత్వం చేతులు దులుపుకుంటోందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రోజురోజుకు విద్యుత్ కనెక్షన్లు పెరుగుతున్నాయి. పెరుగుతున్న సంఖ్యకు అనుగుణంగా పోస్టులు పెంచకపోగా ఉన్న ఖాళీ పోస్టులే భర్తీ చేయటం లేదు. దీంతో నిర్వహణలో సమస్యలు తలెత్తుతున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం సమస్య మూలాన్ని గుర్తించి పరిష్కరిస్తే తప్ప ఇటువంటి ఘటనలు పునరావృతం కావన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. లేకపోతే సిబ్బందినే బాధ్యులను చేసి చేతులు దులుపుకుంటే పెద్దగా ప్రయోజనం చేకూరే అవకాశం లేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

